క్లుప్తంగా

కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు



ఎంపీడీఓ కార్యాలయంలో హాజరు వేసుకుంటున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు నమోదవుతోంది. ఈనెల 16వ తేదీ నుంచి ముఖ ఆధారిత హాజరుకు అందరూ వారి ఫోన్ నంబర్‌లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు ముందు, వెనుక అవడంతో రెండు రోజులనుంచి అధికారులు, సిబ్బంది హాజరు పడలేదు. కొన్ని శాఖల్లో మాత్రం రిజిస్ట్రేషన్లు అవడంతో అధికారులు, సిబ్బంది ముఖ ఆధారిత హాజరును వినియోగిస్తున్నారు. ఉదయం 10.10 గంటల లోపు, సాయంత్రం 5.30 గంటలకు హాజరు వేసుకోవాల్సి ఉంది.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవాల నేపథ్యంలో మక్కువ, మావుడి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం 19,20 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ పి.హరి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో కోరారు.

'ఓపెన్' ఫైనల్ పరీక్షలు బాగా రాయాలి

మక్కువ: ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఫైనల్ పరీక్షలు బాగా రాయాలని జిల్లా విద్యాశాఖాధికారి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ కోరారు. స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం ఎంఈవో వి. మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ ప్రిపరేషన్ ఎగ్జామ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షల్లో పాసైన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల నుంచి శాఖా గ్రంథాలయానికి రావలసిన గ్రంథాలయ పన్ను బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత ఆదేశించారని మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు బుధవారం పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు 2017 నుంచి రావలసిన పన్నుల బకాయిల విషయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ, పంచాయతీ విస్తరణాధికారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇదే విషయంపై ఇప్పటికే సంస్థ కార్యదర్శి జూమ్ మీటింగ్‌ను నిర్వహించారని పేర్కొన్నారు.

కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



వారపు సంతలో తూనికలు కొలతలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్లు


గుమ్మలక్ష్మీపురం: తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్లు కె.రత్నరాజు (పార్వతీపురం), ఎ.బలరామక్రిష్ణ (బొబ్బిలి), టి.శ్రీధర్ (పలాస) అన్నారు. గుమ్మలక్ష్మీపురం గ్రామంలో జరిగిన వారపు సంతలో బుధవారం పర్యటించిన వీరు వారపు సంతలో వ్యాపారులు వినియోగిస్తున్న తూనిక యంత్రాలను (ధర్మకాటా) పరిశీలించారు. ధర్మకాటాలు, తూనిక రాళ్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్లపై లీగల్ మెట్రాలజీ శాఖ సీల్ ఉందో లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా ముద్రలు వేయించుకోని ముగ్గురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. సంత ఆవరణలో ధర్మకాటాను ఏర్పాటు చేసి తూనికలు కొలతలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. వీరి వెంట ఆ శాఖ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

పాలకొండ: స్థానిక విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో గురువారం నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని ఈఈ టి.గోపాలకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. 2023 – 24 సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో అభిప్రాయాలను తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

దస్తూరీతో మంచి మార్కులు

- విద్యార్థులకు సాధన అవసరం



బలిజిపేట: చేతిరాతను బట్టి తలరాత ఉంటుందనేది నానుడి. చేతిరాతను బట్టి మనిషి మనస్తత్వాన్ని, గుణగణాలను అంచనా వేయవచ్చని భావిస్తారు. అక్షరాలు అందంగా, గుండ్రంగా, ఆకర్షణీయంగా ఉంటే వాటిని చూసిన వారు ఎవరైనా ముచ్చటపడతారు. విద్యార్థులు మంచి మార్కులు పొందాలంటే చేతిరాత ఎంతో బాగుండాలి. మార్చిలో ఇంటర్మీడియట్, ఏప్రిల్‌లో పదవ తరగతి పరీక్షలు వస్తున్న నేపథ్యంలో చేతిరాతపై విద్యార్థులు దృష్టిసారించడం మంచిదని పాఠశాలల్లో ఉపాధ్యాయులు హితవు పలుకుతున్నారు. విద్యార్థులకు వారు సూచిస్తున్న సలహాలు ఇలా ఉన్నాయి.

సమీపిస్తున్న పరీక్షలు

మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్మీడియట్, పది పరీక్షలు, తరువాత ఇతరత్రా చదువుల కోసం పరీక్షలు సమీపిస్తున్నాయి. తక్కువ సమయం ఉంది. ఇటువంటి సమయంలో విద్యార్థులు మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. ఎంతైనా చదువుతోనే మార్కులు సంపాదిద్దామని అనుకుంటారు కానీ చేతిరాత గురించి పట్టించుకోరు. దీనివల్ల అనుకున్న మార్కులు పొందలేకపోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంచుకుంటే మంచిరాత వస్తుంది, మంచి మార్కులు పొందవచ్చు. కష్టపడి చదివిన పాఠ్యాంశాల నుంచి పరీక్షలలో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు విద్యార్థి అందంగా రాసే సమాధానాలపై ఎన్ని మార్కులు వస్తాయనేది ఆధారపడి ఉంటుంది.

రోజూ ప్రాక్టీస్ చేయాలి

ఇటు సబ్జెక్టులకు సన్నద్ధమవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టిసారిస్తే రాతపై పట్టు వస్తుంది. అందుకుగాను పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో ఒరవడి రాయిస్తున్నారు.

దస్తూరీ అవసరం

చేతిరాత అందంగా ఉండడం విద్యార్థులకు ఎంతో అవసరం. మంచి మార్కులు రావాలంటే చేతిరాత బాగుండాలి. అందుకు అనుగుణంగా పదవ తరగతి విద్యార్థులకు ఒరవడి పుస్తకాలు రాయిస్తున్నాం. సాధనతోనే చక్కటి చేతిరాత వస్తుంది.

రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు, బలిజిపేట ఉన్నత పాఠశాల

స్పష్టంగా రాయాలి

- ప్రతి విద్యార్థి జవాబు పత్రాల్లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- పేపరుకు నాలుగు వైపులా బోర్డర్ వేసుకుంటే చూసేందుకు అందంగా ఉంటుంది.
- పరీక్షల్లో పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి. చేతిరాత బాగుంటే జవాబు పత్రాలను దిద్దే ఉపాధ్యాయుడు ప్రభావితమవుతాడు.
- అక్షరాలు గుండ్రంగా, అందంగా ఉంటే మంచి మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.
- ఒక లైనుకు మరో లైనుకు సెంటీమీటరు గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి తగినంత (ఒకటి లేదా రెండు అక్షరాలు) స్పేస్ ఇవ్వాలి.
- వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి. బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది.

రబీవరి సాగుపై రైతుల ఆసక్తి



లక్ష్మీపురంలో రైతులు తయారుచేస్తున్న వరినారు మళ్లు

సీతానగరం:

మండలంలోని పలుగ్రామాల్లో నీటివనరులున్న పొలాల్లో రబీ వరి పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ వరి పంట సాగు చేసి కోత కోసి నూర్పు చేసిన భూముల్లో కొంతమంది రైతులు జీరో టిల్లేజీ విధానంతో జొన్నపంట, రబీవరి పంట, పామాయిల్ తోటల పెంపకంపై దృష్టి సారించారు. ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రబీవరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తామరఖండి, బుడ్డిపేట, వెంకటాపురం, లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, బూర్జ, కృష్ణారాయపురం తదితర గ్రామాల్లో వరినారు వేస్తున్నారు. మండలంలోని లక్ష్మీపురంలో వరినారు వేసిన మళ్లను వీఏఏ వినయ్ కుమార్ పరిశీలించారు. రైతు వేసిన వరినారు వయస్సు 15–20 రోజులు కావడం వల్ల నాట్లు వేయడానికి ముందుగా వరికంకులు కుళ్లబెట్టడానికి దమ్ము చేస్తున్నారు.

చెరువుల్లో నీరు అనుకూలం

రబీవరి సాగు చేస్తున్న సందర్భంగా ఏఓ ఎస్ అవినాష్ వద్ద ప్రస్తావించగా బోర్లు, సువర్ణముఖి నదిలో నీరు సమృద్ధిగా లభ్యమవడంతో రబీవరి సాగుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. నీటివనరులు గతంకంటే ఈఏడాది చెరువుల్లో అనుకూలంగా ఉన్నందున పంట పండించడానికి వాతావరణం అనుకూలించడంతో రైతులు రబీవరి సాగు చేయడం మంచిదేనన్నారు. వరినారు ఏపుగా పెరగడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొన వచ్చిన తరువాత 5 సెంట్లు నారుమడి విస్తీర్ణంలో ఉన్న భూమిలో 5 కేజీల యూరియా నీటిలో కలిపిన ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. ఆకులు వచ్చిన తరువాత నారుమడిలో కంపను ఈడ్చాలని తెలపారు. నారుమడిలో కంప ఈడ్చడం వల్ల కాండం తొలుచు పురుగు పెట్టే గుడ్లు పోతాయని తెలియజేశారు. తద్వారా కాండం తొలుచు పురుగు ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో నేత్రవైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురంటౌన్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవ్వాతాతలకు నేత్ర పరీక్షలు గతంలో నిర్వహించినప్పుడు చేయించుకున్న వారికి మాఫప్ కార్యక్రమం ద్వారా వైద్యపరీక్షలు చేస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పెద బొండపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు బుధవారం రామాలయం ఆవరణలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబొండపల్లి సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో 60 ఏళ్ల పై బడిన వారికి నేత్ర పరీక్షలు నిర్వహించామన్నారు. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అవసరమైన రిఫర్ చేశామని తెలిపారు. గతంలో నేత్ర పరీక్షలు చేసిన వారిలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన వారికి ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. కళ్లజోళ్ళు పెట్టుకున్న అవ్వాతాతలు తమ కంటి చూపు ఎంతో మెరుగు పడిందని ఆనందం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సర్పంచ్ వితరణ

సీతానగరం:

మండల కేంద్రంలోని గూడెంవీధిలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన బాధిత కుటుంబాల వారికి స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ కంచాలు, వంటపాత్రలు, నీటి బిందెలు గురువారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పూర్తిస్థాయిలో నాలుగు పూరిళ్లు, పాక్షికంగా మూడిళ్లు దగ్ధమయ్యాయని, పూర్తిస్థాయిలో ఆస్తులు కోల్పోయిన నాలుగు కుటుంబాల వారికి వంటపాత్రలు, ఇతర సామగ్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. పాక్షికంగా నష్ట పోయిన కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలియజేశారు.

నేడు పెదభోగిలి-2 లో గడపగడపకు మన ప్రభుత్వం

సీతానగరం:

మండలంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదభోగిలి-2 సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, నిర్దేశించిన సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

నేడు బహిరంగ వేలం

పాలకొండ: నగర పంచాయతీలోని ఎన్‌కేరాజపురం పరిధిలో ఉన్న గాయత్రి మంత్రాలయం ఆవరణలో గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ బుధవారం తెలిపారు. ఆలయంలో అమ్మవారికి వచ్చే చీరలు, జాకెట్‌లు తీసుకునేందుకు, అమ్మవారికి భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలు తీసుకునేందుకు, అమ్మవారి ఆలయ ఆవరణలో పూజా సామగ్రి విక్రయించేందుకు వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావత్తు రూ.2వేలు చెల్లించాలని తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ హుండీలను లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో 15రోజుల కోసారి వైద్యసేవలు

- వైద్యాధికారిణి అనూష



కృష్ణపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రతి గ్రామంలో 15రోజులకోసారి వైద్యసేవలు అందిసస్తున్నట్లు వైద్యాధికారిణి అనూష తెలిపారు. మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో బుధవారం ఆమె వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో 8రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమవుతున్న పోలీసు యంత్రాంగం



రిహార్సల్స్ చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు

పార్వతీపురం టౌన్: ఈనెల 26న జరగనున్న భారత గణతంత్ర దినోత్సవానికి పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనికి నాందిగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు ఉదయం నుంచి తమ బృందాలతో కసరత్తు ప్రారంభించారు. రిపబ్లిక్ డే కార్యక్రమానికి ప్రత్యేక అధికారులు హాజరు కానుండడంతో సాయుధాలతో వందన సమర్పణ చేసేందుకు రిహార్సల్స్ నిర్వహించారు.

శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నర్సిపురం గ్రామంలో నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవజాత శిశువు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు టీకాలు సమయానికి వేయాలని స్పష్టం చేశారు. ఏవైనా అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యం అందించి అవసరమైతే చిన్న పిల్లల ఆరోగ్య అత్యవసర విభాగాలకు, నవజాత శిశువుల ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలకు రిఫర్ చేసి పర్యవేక్షించాలని సూచించారు. అలాగే టీకాలను క్రమం తప్పకుండా వేసి ఎంసీహెచ్ కార్డులో నమోదు చేయడం, 6 నెలల నుంచి 5సంవత్సరాల లోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఐరన్ సిరప్‌లు తప్పనిసరిగా వేయడం, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, పౌష్టికాహార లోపం గల పిల్లలను గుర్తిస్తే వారిని ఎన్‌ఆర్‌సీ సెంటర్లకు రిఫర్ చేయాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు నవజాత శిశువుల గృహ సందర్శన చేసి వారికిచ్చిన హెచ్‌బీఎన్‌సీ కిట్లు ఉపయోగించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని డాక్టర్ జగన్‌మోహన్ రావు సూచించారు. కార్యక్రమంలో పిల్లల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.ఇందిర

సీతానగరం: బెంగళూరులో బుధవారం నుంచి శుక్రవారం జరగనున్న సీఐటీయూ ఆలిండియా 17వ మహా సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని కాశీపేట రైస్‌మిల్లు వద్ద సీఐటీయూ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభలకు జిల్లాలోని స్కీం వర్కర్లు, సీఐటీయూ అనుబంధ సంఘాల కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జి.వెంకటరమణ మాట్లాడుతూ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను నిరసిస్తూ కార్మిక వ్యతిరేక విధాలపై చర్చిస్తారని తెలిపారు. అంతకు ముందు ఆమె సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 1ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల జిల్లా మండళ్ల నాయకులు ఆర్.ఈశ్వరరావు, ఆర్.రాము, టి.సత్యం పాల్గొన్నారు.

పని చేయని వారి పేర్లు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్

భామిని: జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులో పేర్లు ఉండి ఉపాధి పనులకు హాజరు కాని వారిని డిమాండ్ నుంచి తొలగించాలని ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్ సూచించారు. ఈ మేరకు ఉపాధి సిబ్బందితో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ మేరకు వేతన దారుల సంఖ్యను పెంచాలన్నారు. పనులకు రాని వేతనదారుల పేర్లు తొలగింపుకు ఆప్షన్ రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 3,200 మంది పని చేస్తున్నట్లు డిమాండ్ వచ్చిందన్నారు.

మండల వ్యాప్తంగా యాక్టివ్‌గా 9,302 జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. ఎఫ్‌ఏలు చొరవ చూపి వంద రోజులు పనిదినాలు సమీపిస్తున్న వేతనదారుల లక్ష్యాలను పూర్తి చేయించాలన్నారు. అన్ని గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు కొనసాగాలన్నారు. ఈసీ, టీఏలు, ఎఫ్‌ఏలున్నారు.

ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే చర్యలు



షాపులలో తనిఖీలు చేస్తున్న కమిషనర్, సిబ్బంది

పాలకొండ: నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన మార్కెట్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ప్లాస్టిక్ విక్రయిస్తున్న షాపుల యజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంలో ఉందని తెలిపారు. మొదటి రోజు తనిఖీల్లో 10 షాపులను గుర్తించి వారికి అపరాధ రుసుం విధించామని తెలిపారు. 10 కేజీల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని రూ.10వేలు జరిమానా రూపంలో వసూలు చేశామని తెలిపారు. వ్యాపారులు ఇక నుంచి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

అర్హతే కొలమానంగా సంక్షేమం



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సీతానగరం:

అర్హతే కొలమానంగా లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోంది. అందుకు అనుగుణంగా గ్రామసచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకు వచ్చింది.

చేయూతతో మహిళలకు ఆర్థిక తోడ్పాటు

సంక్షేమ పథకాలు అందించడంలో మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముద్ర వేసుకుంటున్నారు. ఇంటిని చక్కదిద్దేది మహిళలే కావడం వల్ల వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తే కుటుంబాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారనే ఉద్దేశంతో మహిళలకు చేయూత పేరుతో రూ.18,750 అర్హులైన లబ్ధిదారులకు అందజేసి ఆర్థిక తోడ్పాటుకు పాటుపడ్డారు. ఆ డబ్బులతో ఎంతో మంది మహిళలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

పేదలకు గృహయోగం

దశాబ్దాలకు దశాబ్దాలు కాలగమనంలో కలిసిపోతున్నాయి. ప్రభుత్వాలు మారిపోతున్నాయి. అయినప్పటికీ పేదవాడి సొంతింటి కల నెరవేరడంలేదు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది పేదలకు గృహయోగం కల్పించారు. ఆ తరువాత ఆ స్థాయిలో ఏ ఒక్క ప్రభుత్వం పేదలకు గృహయోగం కల్పించలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది పేదవారికి గృహయోగం కల్పిస్తూ గ్రామాలనే నిర్మిస్తున్నారు.

అరులందరికీ సంక్షేమ పథకాలు



మండలంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు వర్తించేలా సచివాలయ సిబ్బంది సహాయంతో సత్వర చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న లే అవుట్‌లు ఏర్పాటు చేసి ఇల్లు లేని వారిని గుర్తించి ఇళ్ల నివేశ పట్టాలు, మౌలిక సదుపాయాలతో కూడిన పక్కాగృహాలు మంజూరు చేస్తున్నాం.

– బి.కృష్ణమహేష్‌రెడ్డి, ఎంపీడీఓ